# రేపటి తరం


సూర్యం రాసిన ఉత్తరం చూసి కంగారుగా హైదరాబాదుకు ప్రయాణం కట్టాడు భుజంగం.

"నేను వస్తానండి" అన్నది రాజ్యం.

"ముందు నేను వెళ్ళిరాని అంటూ బ్యాగు సర్దుకున్నాడు. ఇల్లాలు నాలుగు మెతుకులు తిని వెళ్లండంటున్నా వినకుండా, ఆఘమేఘాల మీద రైల్వేస్టేషను చేరుకున్నాడు. ఎంతకీ రైలు రాకపోవడంతో ప్లాట్‌ఫారం మీద అసహనంగా అటు ఇటు పచార్లు చేయసాగాడు. మాటిమాటికి ఉత్తరంలో విషయమే మస్తిష్కంలో మెదులుతోంది. 'బాబు బస్సు దిగుతూ కాలుజారి కింద పడ్డాడు పెద్దగా దెబ్బలేం తగల్లేదు. పోతే , 'తాతయ్యా!అంటూ అస్తమాను మిమ్మల్నే కలవరిస్తున్నాడు.

వీలైతే ఓసారి రండి'-అది లేఖ సారాంశం.

మనవడికి ముల్లుగుచ్చుకుంటేనే తట్టుకోలేని ఆ తాతహృదయం యాక్సిడెంట్ అంటే ఇహ చెప్పాలా? అందుకే ఆ పరుగు... భుజంగానికి ఇద్దరు కొడుకులు, ఉద్యోగరీత్యా పెద్దవాడు వరంగల్లోను, చిన్నవాడు రాష్ట్ర రాజధానిలో ఉంటున్నారు. అడపా తడపా వాళ్లు రావడం తప్ప భుజంగం మాత్రము వెళ్ళడు. వాళ్లు ఎప్పుడొచ్చినా పిల్లల్ని నెత్తికెక్కించుకుని తిరుగుతాడు. పసివాళ్ళంటే అతగాడికంత ప్రేమ. అందుకే వాళ్ళుకూడా తాతయ్యని మరచిపోలేకపోతున్నారు. వాళ్ళందరికీ పేర్లు తనే పెట్టాడు. ఆ ఇంట్లో అంతా తన అభీష్టం మేరకే జరుగుతూ ఉండటంతో అతడికి కించిత్ గర్వం కూడా ఉంది. అయినా అప్పుడపుడు కొడుకుల చర్యలు చిర్రెత్తిస్తూనే ఉన్నాయి. సూర్యం కొడుక్కి నీలకంఠం అని పేరు పెడితే అది నిఖిల్‌గా రూపాంతరం చెందడం మనోక్లేశానికి కారణమైంది. ఆ వైనాన్ని పరిశీలిద్దాం-



"బాబుకి నీలకంఠం పేరు బాగోలేదండి... మరోటేదైనా పెడదాం" అంది పద్మ.

"దానికేమైంది నిక్షేపంలా ఉంటే నాన్న ఎంతో ముచ్చటపడి ఆ పేరు పెట్టాడు" అన్నాడు సూర్యం.

"పెడతారు. పాతచింత కాయ పచ్చడిలాంటి పేర్లు పెట్టడంలో మీ నాన్న సిద్ధహస్తులు. రేపు వాడు పెద్దవాడైతే ఆ పేరు పెట్టినందుకు మనల్ని తిట్టుకుంటాడు. పేరు మార్చవలసిందే పట్టుబట్టింది పద్మ.

"పోనీ నీలకంఠానికి బదులు నిఖిల్ అని పిలుద్దాం. కాస్తమోడరన్‌గాను ఉంటుంది. పెద్దల మాట మన్నించినట్లు ఉంటుంది.

సూర్యం సూచన సబబుగా ఉండటంతో మరి మాట్లాడలేదు పద్మ. అలాగే పాతపేరు కూడా భవాని అయితే అది బవ్వగా మారిపోయింది. అదేమిట్రా అంటే కాలాన్ని బట్టి పేర్లు ఉండాలి అంటాడు సూర్యం.

"మీరు మరీనండి. వాళ్ల పిల్లల్ని వాళ్ళు ఇష్టం వచ్చినట్లు పిలుచుకోనివ్వరా ఏమిటి? మీరు ఏ పేరుతో పిలిస్తే వాళ్లుకాదన్నారు" అంటూ కొడుకునే సమర్థించింది లాక్ష్మి.

అంతలో ధడధడమంటూ ట్రైను రావడంతో గతంలోని మనసు వర్తమానంలోకి వచ్చిపడింది. హడావిడిగా బ్యాగు పుచ్చుకుని పరుగుతీసాడు భుజంగం.

ఆటో దిగి ఇంట్లోకి అడుగుపెడుతూనే "బాబుకెలా ఉంది?" అడిగాడు ఆతృతగా.

తాతయ్య మాటలు చెవిని పడటంతోనే దిగ్గునలేచి కూర్చున్నాడు నిఖిల్.

"ఎలా ఉందిరా కన్నా" అంటూ ఆ పసివాణ్ణి ఆప్యాయంగా అక్కున చేర్చుకున్నాడు. తాతా మనవళ్ల మధ్య మరి మాటల్లేవు. మనసులతోనే ఊసులాడుకుంటున్నారు. వాళ్ళిరువుర్నీ చూస్తూ స్థాణువులయ్యారు. సూర్యం దంపతులు.

"లేవండి, నాన్నగారు స్నానం చేయ్యండి భోజచేద్దురుగాని" అన్నాడు కాస్సేపయ్యాక సూర్యం.

"వేడినీళ్ళు సిద్ధంగా ఉన్నాయి" అందిపద్మ.

భోజనాల దగ్గర బాబు బస్సుమీంచి ఎలా పడ్డాడో పూసగుచ్చినట్లు చెప్పాడు సూర్యం.

"నువ్వేమను ఆ పసివాణ్ణి బస్సుతో అంతదూరం పంపడం బాగోలేదురా"

తండ్రి మాటలకు నవ్వి ఊరుకున్నాడు సూర్యం, "ఈడు ఏం మించి పోయిందని బళ్ళో వేసేశావ్? అంటూ మండిపడ్డాడు భుజంగం.

మాట్లాడలేదు సూర్యం. "ఆడుకునే వయసులో బడికిపోతే ఇక వాడెప్పుడు ఆడుకుంటాడు మీరు వాడి బాల్యాన్ని హరించేస్తున్నారు. నీమాటకొస్తే ఐదో ఏడు నిండేదాకా నీకసలు అక్షరాభ్యాసమే చెయ్యలేదు తెలుసా?" తను చేసిన పనిని ఘనంగా చెప్పుకున్నాడు భుజంగం.

"అందుకే అరకొర ఉద్యోగాలతో ఎదుగుబొదుగూ లేకుండా జీవిస్తున్నాం. వాడిని కూడా అలాగే తయారు చేయమంటారా? మీకాలం వేరు. నేటి పరిస్థితి వేరు. ఇది పోటీ ప్రపంచం. విద్యాభ్యాసంమూడో ఏటితో ప్రారంభమైతే తప్ప ముందుకు దూసుకెళ్ళలేడు" అన్నాడు సూర్యం.

"అంతేకాదండి. పెద్దయ్యాక వాడు ఆ సెట్టు, ఈ సెట్టు అంటూ ఎన్నో పరీక్షలు రాయవలసి ఉంటుంది. ఇప్పటినుండి చదువులో పెట్టకపోతే వాడెందుకు పనికొస్తాడు"? మొగుడికి వత్తాసుపలికింది పద్మ.

ఇహ వాళ్ళతో వాదించి ప్రయోజనం లేదనిపించింది భుజంగానికి. ఆ రాత్రంతా నిఖిల్‌ని దగ్గర కూర్చోబెట్టుకుని కబుర్లతో కాలక్షేపం చేశాడు. ఆలస్యంగా పడుకోవడం వల్ల లేచేసరికి బారెడు ప్రొద్దెక్కింది.

నిఖిల్కి టిఫిన్ పెట్టి స్కూలుకెళ్ళమని వాళ్ళమ్మ తొందరపెడుతోంది. సూర్యం వాడి పుస్తకాల బ్యాగు సర్దుతున్నాడు. "నేనివాళ బడికెళ్ళను, తాతయ్యతో ఆడుకుంటాను" మారాం చేస్తున్నాడు నిఖిల్.

"వాడినెందుకలా బలవంతం చేస్తున్నారు? తగిలినగాయాలింకా పూర్తిగా నయం కాలేదు. అప్పుడే మళ్ళీ బస్సెక్కిస్తావా?" అన్నాడు భుజంగం పక్కమీంచి లేచొచ్చి.

"ఇవాళ్టికి ఆటోలో పంపిస్తున్నాంలెండి" అందిపద్మ.

"ఒక్కరోజు బడికి వెళ్ళనంత మాత్రాన ఏం కొంపమునిగిపోతుంది."

"ఇప్పటికే నాలుగు రోజులు అఫ్‌సెంటయ్యాడు. ఇంకా మానేస్తే వాళ్ళు ఒప్పుకోరు. ఇంటికి పొమ్మంటారు." అన్నాడు సూర్యం.

"అంతేకాదు. ఇచ్చిన హోంవర్కు తడిసిమోపడైతే, అదంతా మేమే చెయ్యాలి" అంటూ మరి మావగారిని మాట్లాడనివ్వలేదు పద్మ.

ముందుగా చెప్పి ఉంచారు కాబోలు ఆటో వచ్చి గుమ్మంలో ఆగింది. అప్పటికే అందులో పదిమంది పిల్లలున్నారు. భుజాన పుస్తకాల బ్యాగు చేతిలో క్యారేజీతో తూలుతూ వెళ్ళి ఎక్కి పిల్లల మధ్య కూరుకుపోయాడు నిఖిల్.

ఉన్నట్టుండి భుజంగం ఫ్లాష్‌బ్యాక్‌లో వెళ్ళిపోయాడు. చిన్నప్పుడు తను సెలవులలో తాతగారి ఊరెళ్ళడం అక్కడే పిల్లలతోకలిసి గోలీబిల్లలాడటం పతంగులెగరేయడం...తోటల్లో పడి మామిడికాయలు కోసుకుతినటం... రాత్రిళ్ళు తిండితిని డాబా ఎక్కగానే తాతయ్యవచ్చి వేమనశతకంలోని పద్యాలు చదివి 'వినిపించటం... తర్వాత బామ్మ చెప్పే విక్రమార్కుని కథలు... అన్నీ ఒక్కొక్కటిగా స్మృతులకు రావడంతో మనసు చెరువైకళ్ళు చెమ్మగిల్లాయి. ఆరోజు లేవి?... ఆ బాల్యం ఏదీ?... నేడు ర్యాంకులు సాధించడమనే పట్టుదలతప్ప విద్యాసంస్థలు విద్యార్థుల మానసిక ఆందోళనలను పట్టించుకోవడం లేదు. కేవలం ఎమ్.సెట్‌లో ర్యాంకు సాధించడమే ముఖ్యంకాదని జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకోడానికి డాక్టర్లు, ఇంజనీర్లే కానక్కర్లేదని విద్యార్థులకు వివరించవలసిన తరుణంఆసన్నమైంది. ఎందుకంటే మానసిక ఒత్తిడివల్లే ఇటీవలకాలంలో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని, మానసికనిపుణులు హెచ్చరిస్తున్నారు...

తండ్రి ఆలోచనా స్రవంతికి అడ్డుతగులుతూ 'నాన్న' అన్నాడు సూర్యం.

కొడుకు వంక పేలవంగా చూశాడు భుజంగం. "మరేం లేదు నాన్నా భవ్యాని స్కూల్లో సీటంటే పన్నెండువేలు కట్టాలి. మీరు ఊరెళ్ళాకా కాస్త డబ్బుసాయం చెయ్యాలి నాన్నా."

"ఏమిట్రా నువ్వంటున్నది? సంవత్సరమైనా నిండని భవానీని కూడా బడికి పంపిస్తావా?.." నోరు వెళ్ళబెట్టాడు భుజంగం.

"అడ్వాన్సుగా డబ్బుకట్టి పేరు రిజిస్టర్ చేయించుకుంటే తప్ప దానికి మూడో ఏడొచ్చేసరికి ఎల్.కె.జీలో సీటు రాదు. 'హైక్వాలిటీ ఇంగ్లీషు మీడియం స్కూలు డిమాండు అలా ఉంది ఏం చేస్తాం?"

"బాగుందిరా. ఎప్పుడో స్కూల్లో వేస్తావని ఇప్పుడే వేలకు వేలు కట్టాలా? ఇలా ముందు పుట్టిన బిడ్డనే వాళ్ళకు అప్పజెప్పేయమంటారేమో! ఎద్దేవాచేశాడు భుజంగం.

మరి నోరు పెగల్లేదు సూర్యానికి.

రేపటితరాన్ని తలచుకుంటే గుండె గుభిల్లుమన్నది భుజంగానికి. మరక్కడ ఉండబుద్ధిగాకపోవడంతో తిరుగు ప్రయాణానికి బ్యాగు సర్దుకున్నాడు.

( 17 జూన్ 2001 ఆంధ్రప్రభ డెలి )